


# కృష్ణార్జున సంవాదం - 5

## భక్తి భావన పై సరికొత్త దృక్కోణం



"దేవుడు, నిర్వికారుడు కదా.. ఆయనకిన్ని రూపాలేమిటీ, ప్రతి రూపానికీ సంసార బాధలేమిటీ అని నేను చాలాసార్లు అనుకున్నాను. ఇప్పుడు నీ అంతట నువ్వే ఆ ప్రసక్తి తీసుకొచ్చావు. ఏం చెబుతావో వినాలని నాకు చాలా కుతూహలంగా ఉంది" అన్నాడు అర్జునరావు.

కృష్ణారావు గొంతు సవరించుకుని చుట్టూ చూసి, "పదేళ్ళ క్రితం నీ తాతగారు చనిపోయారు. అంటే నీ తాతగారి ఆత్మ అంతవరకూ తాను ధరించిన మానవ శరీరాన్ని విడిచిపెట్టి నిరాకారమైంది. కానీ అటు చూడు, ఆ గోడ మీద నీ తాతగారి ఫోటో - దానికి దండ. అంటే నీవు నిరాకారుడైన నీ తాతగారిని ఆ ఫోటోలో ఊహించుకుని దండవేసి మరీ గౌరవిస్తున్నావు. ఔనా?" అన్నాడు.

"ఔను. ఈ రోజు మా కుటుంబమిలా ఉందంటే అందుకాయనే కారణం. కృతజ్ఞతగా రోజుకొకసారైనా ఆయన్ను గుర్తుంచుకోవడానికి నేనెన్నుకున్న పద్ధతి అది" అన్నాడు అర్జునరావు.

"సృష్టి అంతటా ఆవరించుకున్నాడు కాబట్టి దేవుడు నిరాకారుడన్న విషయంలో అనుమానమేం లేదు. కృతజ్ఞత తెలుపుకుందుకు దేవుడికి రూపమిచ్చారు" అన్నాడు కృష్ణారావు.

"నీవు నీ తాతగార్ని చూసావు కాబట్టి ఆ ఫోటోలోని రూపం నీకు నిజం. పుట్టబోయే నీ పిల్లలకు మాత్రం అది నిజం కాదు, నమ్మకం. ఔనా?" అన్నాడు కృష్ణారావు.

"అర్థమౌతోంది. వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు దేవుణ్ణి చూసారనీ, ఆయనతో మసిలారనీ నేను నమ్మాలంటావు" అన్నాడు అర్జునరావు సాలోచనగా.

"వేల సంవత్సరాల క్రితం దాకా ఎందుకు? ఇరవయ్యో శతాబ్దంలోనూ రామకృష్ణ పరమహంస దేవుణ్ణి తాను చూసి తన శిష్యుడైన వివేకానందుడికి చూపాడు. ఆ వివేకానందుడే తన దివ్యబోధనలతో పాశ్చాత్యులతో సహా యావత్ప్రపంచాన్నీ ప్రభావితం చేసాడు" అన్నాడు కృష్ణారావు.

"సరే - నిరాకారుడికీ రూపమిచ్చాం. కానీ ఒకటితో సరిపెట్టుకోలేదు. బోలెడు రూపాలతో బోలెడుమంది దేవుళ్ళు మనకి అవసరమేనంటావా?"

"పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా - సరళీకృత విధానాలను అమలు పరచి - దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచీ కాపాడి - నేటి మన ఆర్థిక ఔన్నత్యానికి కారణభూతుడయ్యాడు. మరి ఆయనతో సమంగానో, అంతకంటే ఎక్కువగానో నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్‌కి పేరొచ్చింది. ప్రధాని ఒక్కడే ఐనా బాధ్యతా నిర్వహణలో ఆయనకు సాయపడ్డ మంత్రులందరికీ తగిన గుర్తింపునిచ్చి గౌరవించడం

ఉత్తమ సంప్రదాయం. ఈ అనంత విశ్వానికి దేవుడొక్కడే ఐనా ప్రకృతి శక్తులన్నింట్లోనూ దైవత్వాన్ని చూసే ఉత్తమ సంప్రదాయం మనది. అందుకే మనకెందరో దేవుళ్ళు. కాలానుగుణంగా కొత్త మంత్రిత్వశాఖలు వచ్చినట్లే కొత్త కొత్త దేవుళ్ళూ మనకి వస్తూంటారు"

"సరే - ఈ పోలిక ఇక్కడితో ఆగితే బాగుండేది. దైవత్వంతో నిర్వికారంగా ఉండాల్సిన మన దేవుళ్ళు సంసారమనే రొంపిలో పడి మామూలు మనుషుల్లా ప్రవర్తించడం సబబుగా లేదు"

"అది సబబేనని నువ్వే అంటావు - అనంత విశ్వంలోని గ్రహాల స్థిరత్వానికి కారణం తెలిస్తే!!"

"అది నాకు తెలియకేం? అయస్కాంతశక్తి, ఆ శక్తికున్న ఉత్తర, దక్షిణ ధ్రువాలకు ఆకర్షణ - ఇవే అనంత విశ్వంలోని వివిధ గ్రహాలను స్థిరంగా భ్రమింపజేస్తున్నాయి" అన్నాడు అర్జునరావు.

"ఔనా.. అలాగే సృష్టి మనుగడలో జీవాన్ని నింపే వివిధ ప్రాణుల్లో స్త్రీ పురుషులూ, వారి మధ్య ఆకర్షణా ప్రధానమయ్యాయి. ఆ ఆకర్షణలో శృంగారం యాంత్రికమైతే ఆ ప్రాణి జంతువు. శృంగారాన్ని మహత్తర, రసవత్తర, మహోన్నత ప్రక్రియగా భావించిన మనిషి ప్రాణుల్లో మహోత్కృష్టుడయ్యాడు. శృంగారం మృగధర్మమూ కాదు, జుగుప్సాకరమూ కాదని గ్రహించిన మన పూర్వీకులు శృంగారాన్ని దైవత్వంతో ముడిపెట్టి పవిత్రతనాపాదించారు. అందుకే మన దేవుళ్ళతో పాటు వారి దాంపత్య జీవితమూ మనకు ఆదర్శం" అన్నాడు కృష్ణారావు.

"ఎలా?" అడిగాడు అర్జునరావు.

"మనిషిని బ్రహ్మ సృష్టిస్తే - అతడి తెలివి, సంస్కారం, పాండిత్యం వగైరాలను శాసించేది ఆయన భార్య సరస్వతి. మనిషికి విష్ణువు మనుగడనిస్తే అతడి భోగభాగ్యాలను నిర్దేశించేది విష్ణువు భార్య లక్ష్మి. మనిషి సంకటాలను హరించేది శివుడైతే అతడికి శక్తినిచ్చేది శివుని భార్య సతీదేవి. అందుకే మనిషి త్రిమూర్తులను సతీసమేతంగా పూజిస్తాడు"

"కానీ సరస్వతి ఎల్లవేళలా వీణ వాయిస్తూ బ్రహ్మను రంజింపజేయాలి. లక్ష్మి అస్తమానూ భర్తకు పాదాలొత్తాలి. పార్వతికైతే పెళ్ళయ్యేక మహారాణి వైభోగాలు పోయి వల్లకాటి బ్రతుకైంది. త్రిమూర్తుల దాంపత్య జీవితంలోని ఆదర్శమిదేనా?" అన్నాడు అర్జునరావు.

"నీ ప్రశ్నల్లోనే జవాబులూ ఉన్నాయి. మనుషుల్లో భార్య సంగీతాన్ని విని ప్రోత్సహించేదెందరు? వాణీ వీణా నినాదానికి నిత్యశ్రోతగా ఉండే బ్రహ్మలో - భార్య పాండిత్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్న ఆదర్శాన్ని చూడు. తన పాదాలొత్తే లక్ష్మికి విష్ణువు తన హృదయాన్నే పీఠం చేస్తే మరి ఆమె పాదాలెక్కడున్నట్లు? శివుడైతే పార్వతికి అర్ధశరీరాన్నిచ్చి భార్యను అర్ధాంగిగా తెలుసుకోమన్నాడు. ఇవన్నీ మనిషి పాటించేందుకు సాధ్యపడే ఆదర్శాలు కాదంటావా?"

"త్రిమూర్తుల విషయం వదిలిపెట్టు. రాముడు సీతను అనుమానించి అగ్నిప్రవేశం చేయించి ఆ తర్వాత అడవులకు పంపాడు. మరి కృష్ణుడైతే ఎంతమంది ఆడవాళ్ళతో తిరిగాడో లెక్కలేదు. ఇవన్నీ భర్తలకు ఆదర్శమంటే నీ చెల్లెలే ఒప్పుకోదు" అన్నాడు అర్జునరావు నవ్వుతూ.

"సీత అగ్నిప్రవేశం చేస్తే ఆమె ప్రతిష్ఠ పెరిగిందే తప్ప ఆమె వంటికి చిన్న మచ్చ కూడా ఏర్పడలేదు. సీతను అడవుల పాల్జేసిన రాముడు యాగానికి స్వర్ణసీతను తెచ్చుకున్నాడే తప్ప ఏకపత్నీవ్రతాన్ని వీడలేదు. కృష్ణుడు తనను కోరి వరించిన ఆడవాళ్ళతో మాత్రమే తిరుగుతూనే - ఉన్న భార్యలందర్నీ సంతోష పెట్టాడు. ఇష్టమహిషి కాలితో తంతే ఆమెకోసం దివ్యపారిజాతాన్ని సాధించాడే తప్ప ఆమెను సాధించలేదు. ముందు రామకృష్ణుల కఠోర నియమాలను అనుకరించు. తరువాత బహుభార్యాత్వం, పెళ్ళాం అగ్నిప్రవేశం గురించి ఆలోచించొచ్చు"

"ఇప్పటికే నేను వారిననుకరించానేమో - ఎలా తెలుస్తుంది?"

"చాలా సింపుల్. నీ దాంపత్య జీవితంలో ఒక్కరోజు కూడా నీ భార్య నిన్ను దేనికీ తప్పు పట్టకుండా ఎంతో సంతోషంగా ఉంటే చాలు. నువ్వూ ఆ అవతారపురుషులంతటి వాడివనుకోవచ్చు"

"ఎన్ని చేసినా సీత రాముణ్ణి తప్పుపట్టలేదు. కృష్ణుణ్ణి ఆయన ప్రియురాళ్ళు ప్రేమించడం మానలేదు. కానీ నా భార్య వారి భార్యలంత గొప్పది కాకపోతే?"

కృష్ణారావు నవ్వి, "అదే నీ లోపం. రాముడు సీతను అగ్నిప్రవేశం చేయించి అడవులకు పంపించాడనీ, కృష్ణుడు వేలాది యువతులను పెళ్ళాడాడనీ వారికిలా ఉండాలనుకుంటున్నావు. కానీ నీ భార్య సీతలా ఉన్నప్పుడే నువ్వు రాముడివి. ఆమె రుక్మిణిలా ఉన్నప్పుడే నీవు కృష్ణుడివి" అని ఇంకా ఏదో అనబోతూండగా...

"హియర్ హియర్" అంటూ చప్పట్లు కొట్టింది సుభద్ర.

"అప్పుడే ఐపోలేదు" అన్నాడు కృష్ణారావు, "నీకు భాగవతంలోని 'సిరికింజెప్పడు' పద్యం తెలుసుకదా! గజప్రాణావనోత్సాహియైన విష్ణువు సిరికి చెప్పలేదుట. అంటే మామూలుగా ఆయన అన్ని పనులూ భార్యకు చెప్పే చేస్తాడన్న మాట. ఆకర్ణికాంతర ధమ్మిల్లము చక్కనొత్తలేదట. అంటే ఆమె చెంపలచుట్టూ పడేశిరోజాలను సవరించడం ఆయన అలవాటన్న మాట. వివాదప్రోద్ధత శ్రీ కుచోపరి చేలాంచలమైన వీడలేదట. అంటే ఆయన స్నేహితులతో పేకాటకు వెళ్ళకుండా భార్యతోనే సరదాగా గడుపుతూ ముచ్చటగా గొడవలు పడుతూంటాడన్న మాట! అలా ఉండగల పురుషుడే పురుషోత్తముడంటాయి మన పురాణాలు. దేవుళ్ళ సంసారాలకు సంబంధించిన ప్రతి కథా ఇలాంటి ఆదర్శాలతో నిండి ఉంటుంది. అందుకే మన పురాణాల్ని కథలని తీసి పారేయక వాటి పట్ల అవగాహన పెంచుకుంటే ఈ ప్రపంచంలో ఆస్తికులే తప్ప నాస్తికులుండరన్నాను" అన్నాడు కృష్ణారావు. ఆ తర్వాత కృష్ణారావు దేవుడి గురించి ఆసక్తికరమైన విశేషాలు ఇంకా చాలా చెప్పాడు. అవేమిటో వచ్చే నెల తెలుసుకుందాం. ప్రస్తుతానికి సెలవు.

